క్లుప్తంగా

అయ్యప్ప సన్నిధానంలో పెద్దిరెడ్డి



శబరిమలై మార్గంలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ద్వారకనాథరెడ్డి, మిథున్‌రెడ్డి

తిరుపతి మంగళం : మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి శనివారం శంబరిమలైకు చేరుకున్నారు. పంబ నుంచి కాలినడకన అయ్యప్ప సన్నిధానానికి వెళ్లారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

మహిళా చైతన్యంపై వ్యాస రచన



వ్యాసరచన పోటీలలో పాల్గొన్న విద్యార్థులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీ తెలుగు అధ్యయన శాఖ ఆధ్వర్యంలో మాలతీ చందూర్ స్మారక దర్మనిధి సదస్సును పురస్కరించుకుని మహిళా చైతన్యంపై విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. శనివారం వర్సిటీలో జరిగిన ఈ పోటీలలో న్యాయవిభాగం, తెలుగు, ఇంగ్లీషు, గణిత, ఫుడ్ అండ్ టెక్నాలజీ వంటి పలు విభాగాల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థినులు హాజరయ్యారు. ప్రతిభ కనబరచిన విద్యార్థినులకు ఈ నెల 20వ తేదీన బహుమతులు ప్రదానం చేయనున్నట్లు వర్సిటీ అధికారులు తెలిపారు.

27 వరకు 'ఓపెన్' పరీక్ష ఫీజుకు అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల : ఓపెన్ స్కూల్ పరీక్ష రాసేందుకు విద్యార్థులు ఈ నెల 27వ తేదీలోపు ఫీజు చెల్లించాలని ఎంఈఓ బాబ్జీ తెలిపారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యా సంక్షేమ కార్యదర్శులు, సీఆర్పీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతి, ఇంటర్ ఫెయిల్ అయిన వారు ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటి వద్దనే ఉంటూ పరీక్షలు రాయవచ్చని వెల్లడించారు. పుస్తకాలను ప్రభుత్వమే అందిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 లింగయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణి, సీఆర్పీలు శ్రీనివాసులు, ప్రకాష్‌రెడ్డి, శివకుమారి పాల్గొన్నారు.

ప్రమాదాలపై డ్రైవర్లకు అవగాహన



శిక్షణ పొందుతున్న డ్రైవర్లతో బాలాజీ

తిరుపతి అర్బన్ : రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డ్రైవర్లకు అవగాహన కల్పించారు. శనివారం తిరుపతి అలిపిరి డిపోలోని డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పొందుతున్న 28వ బ్యాచ్‌కు ట్రాఫిక్ నిబంధనలను న్యాయవాది ఎం.బాలాజీ వివరించారు. ఆయన మాట్లాడుతూ నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీంతో ఎన్నో కుటుంబాలు ఛిద్రమవుతున్నట్లు వెల్లడించారు. డ్రైవింగ్ సీట్‌లో కూర్చున్న వారు తమ వెనుక సీట్లలో అనే కుటుంబాల భవిష్యత్ ఉందనే విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. అలాగే డ్రైవర్లకు మెకానిజంలోనూ నైపుణ్యం ఉండాలని కోరారు. ప్రిన్సిపాల్, అలిపిరి డీఎం హరిబాబు మాట్లాడుతూ ఇప్పటి వరకు 27 బ్యాచ్‌లకు దిగ్విజయంగా శిక్షణ పూర్తిచేశామని చెప్పారు. 29వ బ్యాచ్‌కి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ నిర్వాహకుడు రాము పాల్గొన్నారు.

8న అవార్డుల ప్రదానం

తిరుపతి కల్చరల్ : అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సెప్టెంబర్ 8వ తేదీన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత సాఫల్య అవార్డులు ప్రదానం చేయనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు ఎస్.సరోజనమ్మ తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె మాట్లాడారు . ఆసక్తిగలవారు ఈనెల 28వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలను 6302908528 నంబర్‌కు పంపాలని సూచించారు. షేక్ ఖాదర్ భాషా, యోగేష్‌బాబు, షామీర్ పాల్గొన్నారు.

తిరుచ్చిపై కల్యాణ వెంకన్న విహారం

చంద్రగిరి : శ్రీనివాసమంగాపురంలో శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు శనివారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై భక్తులకు దర్శనమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను సమర్పించారు. సాయంత్రం దేవదేవేరులను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో ఊరేగించారు.

నిరాదరణ





సర్కారు పెద్దలు పేద బిడ్డల పొట్టగొడుతున్నారు. రుచి..నాణ్యత సంగతి దేముడెరుగు కనీసం భోజనం కూడా వడ్డించలేకపోతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న గోరుముద్ద పథకం కింద పిల్లలకు రోజుకో రకం వంటకాలతో సంతృప్తిగా ఆహారం అందించేవారు. 'కూటమి' కొలువుదీరిన తర్వాత విద్యార్థుల కడుపు మాడుస్తున్నారు. శనివారం తిరుపతిలోని బైరాగిపట్టెడలో ఉన్న ఎంజీఎం మున్సిపల్ పాఠశాలలో ప్రభుత్వం నిరాదరణకు గురై ఇంటి నుంచే చిన్నారులు క్యారియర్ తెచ్చుకుని ఆకలి తీర్చుకుంటున్న దృశ్యం 'సాక్షి' కంటపడింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

నిరసన



తిరుపతిలో వైద్య సిబ్బందికి సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన అకృత్యానికి వైద్యసిబ్బంది నిరసన తెలిపారు. శనివారం తిరుపతి నగరంతోపాటు చంద్రగిరి.. చిన్నగొట్టిగల్లు మండలాల్లో ఆందోళనకు దిగారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ప్రాణం పోసే వైద్యులకు రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి స్వాంతన చేకూర్చాలని స్పష్టం చేశారు.

– తిరుపతి తుడా, చంద్రగిరి, భాకరాపేట



చంద్రగిరిలో..



చిన్నగొట్టిగల్లులో..

తుప్పు.. ఎవరిది తప్పు?

ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టేందుకు అటవీశాఖ చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. ఎక్కడికక్కడ అక్రమ రవాణాలను అడ్డుకుంటోంది. ఈ క్రమంలోనే పలు వాహనాలను సీజ్ చేస్తోంది. అయితే స్వాధీనం చేసుకున్న వాటిని ఫారెస్ట్ కార్యాలయాల వద్దే గాలికి వదిలేస్తోంది. సకాలంలో వేలం వేయకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో ప్రభుత్వం రూ.కోట్ల ఆదాయం నష్టపోతోంది. పట్టించుకునేవారు లేకపోవడంతో వాహనాలు తుప్పు పట్టి.. చుట్టూ తుప్పలు పెరిగి పాత సామాన్ల కింద విక్రయించాల్సిన దుస్థితి దాపురిస్తోంది

- శిథిలావస్థలో అటవీశాఖ సీజ్ చేసిన వాహనాలు
- వేలం వేయకపోవడంతో ప్రభుత్వానికి రూ.కోట్ల నష్టం
- మూడేళ్ల నుంచి నిరుపయోగంగా వందలాది బండ్లు
- పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు

తిరుపతి మంగళం : శేషాచల అడవుల నుంచి స్మగ్లర్లు అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనంతోపాటు పట్టుబడిన వాహనాలు వ్యర్థాలుగా మారిపోతున్నాయి. వేలానికి నోచుకోక ఎండకు ఎండి, వానకు తడిచి తుప్పు పట్టి గుజరీ(పాతసామాన్లు కొనుగోలు దుకాణం)కి వేయాల్సిన స్థితికి చేరుకున్నాయి. తిరుపతి అటవీశాఖ డివిజన్ పరిధిలో గత మూడేళ్లుగా ఎర్రచందనాన్ని అక్రమంగా తరలిస్తున్న స్మగ్లర్ల నుంచి అధికారులు పట్టుకున్న వందలాది వాహనాలు వేలానికి నోచుకోక శిథిలమైపోతున్నాయి. దీనికి తోడు వాహనాల్లోని అనేక వస్తువులను ఇంటి దొంగలే షెడ్లకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాహనాల్లో మాయమవుతున్న వస్తువులపై గతంలో అటవీశాఖ అధికారులు సైతం సిబ్బందిని మందలించినట్లు సమాచారం. పట్టుబడిన వాహనాల్లో చెట్లు కూడా మొలిచాయంటే పరిస్థితి ఏంటో అర్థమవుతోంది.



అటవీశాఖ తిరుపతి డివిజన్ పరిధిలో శిథిలావస్థకు చేరిన వాహనాలు

రూ.కోట్ల ఆదాయం నేలపాలు..

తిరుపతి వైల్డ్‌లైఫ్ డివిజన్ పరిధిలోని తిరుపతి, భాకరాపేట, మామండూరు, నాయుడుపేట, బాలాయపల్లె రేంజ్ పరిధిలో అటవీశాఖ, టాస్క్‌ఫోర్స్, పోలీసులు సీజ్ చేసిన వాహనాలు సుమారు 400 నుంచి 500 వరకు ఉన్నాయి. వీటిని స్వాధీనం చేసుకుని సుమారు మూడేళ్లు గడుస్తున్నా వాటిని వేలం వేయడంలో అటవీశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పట్టుబడిన వాహనాలకు వెంటనే వేలం వేసి ఉంటే ప్రభుత్వానికి రూ.కోట్లల్లో ఆదాయం వచ్చేది. ఇప్పుడు రూ.లక్షలు కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.



సరైన రికార్డులు లేకపోవడం వల్లే..

ఎర్రస్మగ్లర్ల నుంచి పట్టుకున్న వాహనాలకు సరైన క్లియరెన్స్ (పత్రాలు) లేకపోవడంతో వేలం నిర్వహించలేకపోతున్నాం. అలాగే రవాణాశాఖ అధికారులు పట్టుబడిన వాహనాలకు ధర నిర్ణయించాల్సి ఉంది. అలాగే కొన్ని వాహనాలు చోరీకి గురైనట్లు కేసులు నమోదు కావడం వల్ల వేలం వేయలేకపోయాం. త్వరలోనే ఉన్నతాధికారుల అనుమతి తీసుకుని వాహనాలకు వేలానికి టెండర్లకు పిలుస్తాం.

– సతీష్‌రెడ్డి, డీఎఫ్‌ఓ, తిరుపతి వైల్డ్‌లైఫ్



20న ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు

తిరుపతి అర్బన్ : తిరుపతి పద్మావతిపురంలోని ఐటీఐ ప్రభుత్వ కళాశాల వద్ద ఈ నెల 20వ తేదీన ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్న ట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆసక్తిగవారు ఈ నెల 19వ తేదిలోపు పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.డిక్సన్ టెక్నాలజీస్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్‌లో ఉద్యోగాలకు 18 నుంచి 30ఏళ్ల వయస్సు గల పదోతరగతి,ఇంటర్,డిగ్రీ,ఐటీఐ, డిప్లొమా పూర్తి చేసినవారు అర్హులుగా పేర్కొన్నారు. వివరాలకు 8143576866 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

1 నుంచి ఏఐటీయూసీ సమ్మేళనం

తిరుపతి కల్చరల్ : విశాఖపట్నంలో సెప్టెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు ఏఐటీయూసీ జాతీయ సమితి సమ్మేళనాలు నిర్వహించనున్నట్లు హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్‌డీ రవి తెలిపారు. శనివారం హమాలీ వర్కర్స్ యూనియన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హమాలీ వర్కర్లకు ప్రభుత్వంఎలాంటి సంక్షేమ పథకాలు అందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే సంక్షేమ పథకాల సాధనకు పోరాటం సాగించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో యూనియన జిల్లా ప్రధాన కార్యదర్శి బాబు, సుబ్రమణ్యం,బాషా,కుమార్, వెంకటేష్ పాల్గొన్నారు.

చేపల చెరువుల వేలం

భాకరాపేట : చిన్నగొట్టిగల్లు మండలం నెల్లుట్లవారి పల్లె పంచాయతీలోని చేపల చెరువుల వేలం పాటను సర్పంచ్ శశిప్రియ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. బొమ్మాయిచెరువు రూ.98,500, పడవాలమ్మచెరువు రూ.1,86,000, రెడ్డిచెరువు రూ. 70,000లకు పాటదారులు దక్కించుకున్నారు. చెరువుల వేలం ద్వారా పంచాయతీకి మొత్తం రూ.3,54,500 ఆదాయం వచ్చినట్లు సర్పంచ్ వెల్లడించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు మదనమోహనరాజు, వెంకటేశ్వరావు, వెంకటమోహన్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కొత్త చట్టాలు ప్రమాదకరం



మాట్లాడుతున్న పత్తికొండ మురళి

తిరుపతి లీగల్ : కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన మూడు చట్టాలు ప్రమాదకరమని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, ఇండియన్ లాయర్స్ అసోసియేషన్, బీసీ న్యాయవాదుల సంఘాలు డిమాండ్ చేశాయి. శనివారం తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో కొత్త చట్టాలపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వై.షణ్ముగం యాదవ్ మాట్లాడుతూ కొత్త నేర చట్టాలను పరిశీలిస్తే పాత చట్టాలే నయమనిపిస్తున్నాయని తెలిపారు. ఇందులో న్యాయవ్యవస్థ కంటే పోలీసులకే ఎక్కువ అధికారాలను కట్టబెట్టడం సరికాదని మండిపడ్డారు. పత్తికొండ మురళి మాట్లాడుతూ కొత్త చట్టాల ప్రకారం పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండానే మూడు రోజుల వరకు ప్రాథమిక విచారణ చేయవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. బి.రవి మాట్లాడుతూ కొత్త చట్టాల ప్రకారం నేరం రుజువు కాకపోయినా నిందితుల ఆస్తులను పోలీసులు జప్తు చేయవచ్చని, అది మరింత ప్రమాదకరమని విమర్శించారు. బొకం రమేష్ మాట్లాడుతూ కొత్త నేర చట్టాలతో సత్వర న్యాయం మాట అటు ఉంచితే, న్యాయ ప్రక్రియను సంక్లిష్టం చేసే పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. సుబ్రమణ్యం యాదవ్ మాట్లాడుతూ పాత చట్టాలు వాటి సెక్షన్లను మార్చడం వల్ల ప్రజలు తమ న్యాయ పరిజ్ఞానం కోల్పోతారని స్పష్టం చేశారు. సమావేశంలో వివిధ న్యాయవాద సంఘాల నాయకులు లక్ష్మన్న, గొంది హరినాథ్‌నాయుడు, గిరి, నేతాజీ, భాను, వెంకట్, అజయ్, అమరేశ్వరి పాల్గొన్నారు.

ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం



ఉపరాష్ట్రపతికి స్వాగతం పలుకుతున్న పీసీ రాయులు

తిరుపతి కల్చరల్ : రేణిగుంట విమానాశ్రయంలో భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్‌కు ఘన స్వాగతం లభించింది. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వెంకటాచలంలోని స్వర్ణభారత ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలకు హాజరయ్యేందుకు శనివారం ఆయన విచ్చేశారు. ఈ మేరకు కస్తూర్బాగాంధీ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ పీసీ రాయులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఆర్థిక సాయం

పాకాల : స్థానిక రామకృష్ణమందిరం వీధికి చెందిన సీనియర్ పాత్రికేయుడు కామేశ్వర్(53) ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఆయన కుటుంబీకులకు పాకాల పాత్రికేయులు శనివారం రూ.20వేల ఆర్థికసాయం అందించారు.

పిట్టగోడను ఢీకొన్న కారు

తిరుమల: తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో కారు అదుపుతప్పి రక్షణగోడను ఢీకొని అటవీ ప్రాంతంలోకి దూసుకెళ్లిన ఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. తిరుపతికి చెందిన హరినాథ్, లక్ష్మణ్ తమ కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చారు. కారులో కిందకు దిగుతుండగా 18వ మలుపు వద్ద ప్రమాదం జరిగింది. గాయపడిన నలుగురినీ తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. ఘటనాస్థలం నుంచి కారును పోలీసులు తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

సామాజిక స్పృహ ఉంటేనే సాహిత్యం



అవార్డు గ్రహీతలతో అతిథులు

తిరుపతి కల్చరల్ : రచనల్లో సామాజిక స్పృహ ఉంటేనే సిసలైన సాహిత్యమని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత మధురాంతకం నరేంద్ర తెలిపారు. శనివారం బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సాహితీ పురస్కారాల ప్రధానోత్సవం నిర్వహించారు. మునిసురేష్‌పిళ్లైకి శివేవారి దేవమ్మ స్మారక కథా పురస్కారం, ఆర్‌సీ కృష్ణస్వామిరాజు, కూచిమంచి సాగేంద్రకు బాలల కథా పురస్కారం అందించారు. అనంతరం కేవీ మేఘనాథరెడ్డి రచించిన పాయిదరువులు నవలను ఆవిష్కరించారు. నరేంద్ర మాట్లాడుతూ నేటి తరానికి పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. సాహిత్యానికి ప్రత్యేకంగా తెలుగు భాషలో పత్రిక లేకపోవడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మేఘనాథరెడ్డి వంటి యువ రచయితలు విశేషంగా రాణిస్తున్నారని ప్రశంసించారు. అచార్య ఆశాజ్యోతి మాట్లాడుతూ యువ రచయితలు తమ రచనల్లో సామాజిక వాస్తవికత, సమకాలీన సమస్యలను చక్కగా ప్రతిబింబిస్తున్నారని కొనియాడారు. పలమనేరు బాలాజీ మాట్లాడుతూ పాయిదరువులు నవల గ్రామీణ నేపథ్యంలో గిరిజన జీవితాలకు దర్పణం పట్టిందన్నారు.కార్యక్రమంలో సాహితీ వేత్తలు సీఎస్ చంద్రశేఖర్, పల్లిపట్టు నాగరాజు, సాకం నాగరాజు, జిల్లేళ్ల బాలాజీ, మౌని, కొత్వాల్ అమరేంద్ర, గరికపాటి రమేష్‌బాబు పాల్గొన్నారు.

తిరుమలలో హాకర్ల పరస్పర దాడులు

తిరుమల : తిరుమలలోని నందకం సమీపంలో అనధికార హాకర్లు పరస్పరం దాడులు చేసుకున్న ఘటన శనివారం చోటుచేసుకుంది. తిరుమల టూటౌన్ పీఎస్ సీఐ సత్యనారాయణ కథనం మేరకు.. వెంకటేష్ శ్రీకాంత్ అనే ఇద్దరు అనధికార హాకర్లు సోపులు, షాంపులు విక్రయించేవారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వివాదం ఏర్పడి ఘర్షణ తలెత్తింది. దీంతో గాజువాటర్ బాటిళ్లు తీసుకుని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో వారి తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న టీటీడీ భద్రతా సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని వారిని టీటీడీ అశ్విని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. దాడులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

తిరుమలలో భక్తులకు రక్షణ కల్పించాలి : ఎంపీ గురుమూర్తి

తిరుమలలో భక్తులకు రక్షణ కల్పించాలని ఎంపీ గురుమూర్తి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తిరుమలలో వేలాదిమంది భక్తులు చూస్తుండగానే హాకర్లు నడిరోడ్డుపై రక్త గాయాలయ్యేలా కొట్టుకున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కొండపైన దుకాణం నిర్వహించే ఓ దుకాణదారుడు భక్తుడిని గాయపరచిన ఘటన మరువకముందే అలాంటి మరో ఘటన పునరావృతం కావడం కచ్చితంగా నిఘా అధికారుల వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో నిఘా కొరవడిందని, తిరుమల కొండపై అనధికార హాకర్లు ఎక్కువయ్యారని తెలిపారు. ఇప్పటికైనా టీటీడీ ఉన్నతాధికారులు భక్తుల రక్షణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సంచార జాతుల అభ్యున్నతికి కృషి



ఎస్టీ కమిషన్ సభ్యుడికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్, కమిషనర్

తిరుపతి అర్బన్: సంచార జాతుల అభ్యున్నతికి అధికారులందరూ కృషి చేయాలని నేషనల్ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జేసీ శుభం బన్సల్, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ నారపురెడ్డి మౌర్య, డీఆర్‌ఓ పెంచల కిషోర్, జిల్లా గిరిజన విభాగం అధికారి సూర్యనారాయణతో కలసి సమావేశం నిర్వహించారు. హుస్సేన్ మాట్లాడుతూ గిరిజనలు ఎదుర్కొంటున్న రెవెన్యూ, అట్రాసిటీ సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. గిరిజనుల ఏకలవ్య వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన భోజనం, మౌలిక వసతులు కల్పించాలని స్పష్టం చేశారు. హథీరాంజీ మఠం భూములకు సరైన రక్షణ కల్పించాలని సూచించారు. తిరుపతిలో గిరిజన భవన్ నిర్మించి ఆయా సంఘాలకు అప్పగించాలని ఆదేశించారు.

అధికారులపై ఆగ్రహం

సమావేశ నిర్వహణకు కలెక్టరేట్‌కు విచ్చేసిన ఎస్టీ కమిషన్ సభ్యుడికి స్వాగతం పలికిన కలెక్టర్ వెంటనే జిల్లా పర్యటనకు వెళ్లిపోయారు. తీరా సమావేశ మందిరంలోకి వెళ్లిన తర్వాత అక్కడ అధికారులు ఎవరూ కనిపించకపోవడంతో ఎస్టీ కమిషన్ సభ్యుడు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ స్పందించి జిల్లా అధికారులను అప్రమత్తం చేశారు. అనంతరం అధికారులు సమావేశానికి చేరుకున్నారు.

ఫిర్యాదుల వెల్లువ

ఎస్టీ కమిషన్ సభ్యుడికి పలువురు ఫిర్యాదులు అందించారు. కలెక్టరేట్ సమీపంలోని నక్కలకాలనీ వాసులు తమ ఆవేదన తెలిపారు. వేరే చోటు నుంచి ఇక్కడకు వలస వస్తే.. ఇప్పుడు ఇక్కడ నుంచి ఖాళీ చేసి వెళ్లమంటున్నారని తెలిపారు. తిరుమల పాపవినాశంలో తమ షాపులను ఖాళీ చేయమంటున్నారని గిరిజనులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన వారికి న్యాయం చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమశాఖ జిల్లా అధికారి పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్



ఆహ్లాదం

తిరుపతిలోని అలిపిరి పాదాల మండపం వద్ద ఉద్యానవనం సందర్శకులకు ఆహ్లాదం పంచుతోంది. చిన్నికృష్ణుని సన్నిధి వికసిత కలువలతో మనసును పులకింపజేస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

వెటర్నరీ విద్యార్థికి అంతర్జాతీయ పురస్కారం



నస్వర్ ఖాన్‌ను అభినందిస్తున్న వీసీ, డీన్

తిరుపతి సిటీ: మలేషియాలోని యూనివర్సిటీ ఆఫ్ పుత్రా వేదికగా ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు మూడురోజుల పాటు జరిగిన అంతర్జాతీయ ఆహార పరిశోధనా కన్వరెన్స్‌లో తిరుపతి ఎస్వీ వెటర్నరీ వర్సిటీ బీవీఎస్సీ అండ్ ఏహెచ్ స్కాలర్ నస్వర్‌ఖాన్ అంతర్జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. ఆయన తిరుపతి పరిసర ప్రాంతాల్లో సేకరించిన మీట్ శాంపిల్స్‌లో యాంటిబయోగ్రామ్, స్టెఫిలోకాకస్ అరియస్ వ్యాప్తిపై అధ్యయనం అనే అంశంపై పరిశోధన ప్రాజెక్ట్ సమర్పించారు. వర్సిటీ వీసీ రమణ, డీన్ వీరబ్రహ్మయ్య, అసోసియేట్ డీన్ జగపతిరామయ్య, అధ్యాపకులు జగదీష్‌బాబు, శివశ్వేత, రమ్య పాల్గొన్నారు.